ఎమ్మెల్యే పర్యటన


కాప్రా డివిజన్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

కాప్రా: నియోజవర్గ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం కాప్రా డివిజన్‌లో పర్యటించిన ఆయన ఎల్లారెడ్డిగూడ, మహ్మదీయకాలనీల్లో పర్యటించి స్థానిక సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు తమ సమస్యలపై ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం కాప్రాకు చెందిన సామాజిక కార్యకర్త జైని రాజేశ్వర్‌ను ఎమ్మెల్యే శాలువాతో సత్కరించారు. డీఈ బాలకృష్ణ, జలమండలి డీజీఎం సతీష్, ఏఈ సూరజ్, రోహిత్, ఎలక్ట్రికల్ ఏఈ సత్యనారాయణ, బీఆర్ఎస్ నేతలు ఎం.కే బద్రోద్దీన్, భైరి నవీన్‌గౌడ్, ఇంద్రయ్య, స్థానికులు జైని రాజేశ్వర్, శ్రీనివాస్, రఘు, మహేష్ పాల్గొన్నారు.

కొత్త ఆలోచనతో ముందుకెళ్లాలి

బోడుప్పల్: కొత్త సంవత్సరంలో విద్యార్థులు కొంగొత్త ఆలోచనలతో ముందుకెళ్లాలని 19వ డివిజన్ కార్పొరేటర్ సామల పవన్‌రెడ్డి అన్నారు. బృందావన్ కాలనీలోని జేజీఆర్ ఉన్నత పాఠశాలలో మంగళవారం రాత్రి జరిగిన నూతన సంవత్సర వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్రమశిక్షణ, పట్టుదలతో పాటు కొత్త ఆలోచనలతో ముందుకు నడవాలన్నారు. అనంతరం కేక్ కట్ చేసి విద్యార్థులకు పంచి పెట్టారు. పాఠశాల కరస్పాండెంట్ గంగరాజు, ఇన్‌చార్జి విజయకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


నూతన సంవత్సర వేడుకల్లో విద్యార్థులు

అంగన్‌వాడీ కేంద్రంలో..

మల్కాజిగిరి: ఓల్డ్ మల్కాజిగిరి అంగన్‌వాడీ కేంద్రంలో నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రం పరిధిలోని చిన్నారులు వారి తల్లుల సమక్షంలో కేక్‌కట్ చేసి వేడుకలను నిర్వహించారు. సూపర్‌వైజర్ వింధ్యవాహిని, అంగన్‌వాడీ టీచర్ ఆశాలత తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే శుభాకాంక్షలు



అల్వాల్: తెలంగాణ రాష్ట్రం నూతన సంవత్సరంలో పాడిపంటలతో తులతూగాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర, నియోజకవర్గ ప్రజలందరికీ ఆయన 2025 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఆలోచనలు, ఆకాంక్షలు, స్పష్టమైన లక్ష్యాన్ని ఎంచుకుని క్రమశిక్షణ, నిబద్ధత, పట్టుదలతో ముందుకు సాగుతూ జీవితంలో ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు.

ఉరేసుకుని వృద్ధుడి ఆత్మహత్య

అల్వాల్: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వృద్ధుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధి హస్మత్‌పేటలో జరిగింది. ఎస్సై మహేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన కేధార్‌నాథ్ (65) బతుకుదెరువు కోసం నగరానికి వలస వచ్చి హస్మత్‌పేటలోని ఓ కేటరింగ్ షాప్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. కడుపులో నొప్పి వస్తుండటంతో 8 నెలల క్రితం ఆసుపత్రికి వెళ్లగా.. హెర్నియా ఆపరేషన్ చేశారు. తరచుగా తిరిగి అనారోగ్యానికి గురవుతుండటంతో తాళలేక సోమవారం రాత్రి క్యాటరింగ్ షాప్ సమీపంలోని ఓ షెడ్డులో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య ఐదుగురు కుమారులు ఉన్నారు. వీరు ఉత్తర్‌ప్రదేశ్‌లోనే ఉంటున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించండి

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ స్థలాలను కాపాడాలని బోడుప్పల్ అఖిల పక్ష కమిటీ ప్రతినిధులు మంగళవారం మేడిపల్లి తహసీల్దార్ హసీనా, హైడ్రా కమిషనర్ రంగనాథ్, మేడ్చల్ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం అఖిల పక్ష కమిటీ అధ్యక్షుడు బాలరాజ్‌గౌడ్ మాట్లాడుతూ.. బోడుప్పల్‌లోని డివిజన్ 12, 13 పరిధిలోని సర్వేనంబరు 63/1 అంబేడ్కర్‌నగర్, దేవేందర్‌నగర్, సర్వేనంబరు 63/26 నుంచి 38లో గల గౌతమీనగర్, రాజీవనగర్ ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురవుతున్నాయన్నారు. బోగస్ పత్రాలు సృష్టించి ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారన్నారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అఖిల పక్షం కమిటీ ప్రధాన కార్యదర్శి చీరాల జంగయ్య, సలహాదారులు ఏనుగుల లక్ష్మయ్య, సాయిని అమృతం, రాపోలు శంకరయ్య, తలారి కృష్ణయాదవ్, రమేష్ పాల్గొన్నారు.


కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న కమిటీ సభ్యులు

యువకుడి ఆత్మహత్య

అల్వాల్: తల్లి మృతి చెందిందనే ఆవేదనతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుభాష్‌నగర్‌లో నివసించే అమృత 5 నెలల క్రితం గుండె నొప్పితో మృతి చెందింది. కాగా ఆమె కుమారుడు భరత్ (29) సోమవారం ఉదయం ఇంట్లో ఉరేసుకున్నాడు. అతడిని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ.. మంగళవారం మృతిచెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక


నాగరాజు

అల్వాల్: నేరేడ్‌మెట్‌లోని మల్కాజిగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థి కె.నాగరాజు జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఉమాదేవి తెలిపారు. ఈనెల 30న నగరంలోని జింఖానా గ్రౌండ్స్‌లో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జావెలిన్ త్రోలో బంగారు పతకం సాధించాడు. జనవరి 5న జార్ఖండ్ రాష్ట్రం రాంచీలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో నాగరాజు పాల్గొననున్నట్లు చెప్పారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు

బోడుప్పల్: అనుమతులు లేకుండా చేపట్టే అక్రమ నిర్మాణాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని బోడుప్పల్ కమిషనర్ రామలింగం అన్నారు. బోడుప్పల్ శ్రీసాయినగర్ కాలనీ ప్రధాన రహదారిలో అనుమతి లేకుండా చేపట్టిన సెల్లార్‌ను మంగళవారం మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనుమతి లేకుండా సెల్లార్ నిర్మిస్తున్నారని, స్థానికుల ఫిర్యాదు మేరకు కూల్చివేసినట్లు తెలిపారు. నిర్మాణదారులు ఇంటి అనుమతులు తీసుకుని ఇళ్లు నిర్మించుకోవాలన్నారు. లేదంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. టీపీఎస్ కావ్య, సిబ్బంది పాల్గొన్నారు.


జేసీబీతో అక్రమ సెల్లార్‌ను తొలగిస్తున్న దృశ్యం

మహిళల సంక్షేమానికి కృషి

మల్కాజిగిరి: డివిజన్ పరిధిలోని మహిళల సంక్షేమానికి తగిన చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. ఓల్డ్ మల్కాజిగిరిలో మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక మహిళల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సరఫరా సమస్యల పరిష్కారానికి పవర్ బోర్లు ఏర్పాటు చేయాలని కోరారు. మహిళా గ్రూపు సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం నుంచి ముద్రాలోన్స్ వచ్చేలా చూడాలని కోరగా.. త్వరలోనే బ్యాంకర్లతో సమావేశం ఏర్పాటు చేసి లోన్లు వచ్చేలా చూస్తామన్నారు. శ్రీకాంత్‌యాదవ్, జైకృష్ణ, రజనీ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ కౌకూర్ భరత్ నగర్, సామలలక్ష్మి ఎన్‌క్లేవ్‌లో డ్రైనేజీ పనులకు మంగళవారం కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు బొబ్బిలి సురేందర్‌రెడ్డి, మల్లికార్జున్, వెంకటేష్, దేవేందర్, కాలనీవాసులు ముత్యాలు రాజిరెడ్డి, రాజు, వీరేశం, లావణ్య, సంధ్యారాణి, పావని, స్వరూప, శైలజ పాల్గొన్నారు.

కేలండర్ల ఆవిష్కరణ

ఉప్పల్, మల్కాజిగిరి జోన్ల పరిధిలో 2025 నూతన కేలండర్లను ఆవిష్కరించారు. కమలానగర్ కాలనీ సంక్షేమ సంఘం, కౌండిన్య సంఘం, సురేష్ సేవా సమితి మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి, నాయకులు శోభన్, డోలి రమేష్, దప్పు రాజు, జావిద్, ఢిల్లీ పరమేష్, శంకర్‌రెడ్డి, శ్రీదేవి, వర్ష, రేవంత్‌రెడ్డి, సతీష్ పాల్గొన్నారు.

కృష్ణవేణి టాలెంట్ స్కూల్...

మౌలాలి: మౌలాలి డివిజన్ ఓల్డ్ సఫిల్‌గూడలో ఉన్న కృష్ణవేణి టాలెంట్ స్కూల్ పాఠశాల డైరెక్టర్ చంద్రమౌళి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పిల్లలకు, తల్లిదండ్రులకు స్ఫూర్తిదాయకంగా ప్రసంగించారు. విద్యార్థులందరూ చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జాన్ సురేష్, వెంకటేష్, శ్వేత, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

శ్రీ చైతన్య, విజ్ఞాన భారతి హైస్కూల్...

మల్లాపూర్: శ్రీ చైతన్య ఎడ్యుకేషనల్ సొసైటీ, విజ్ఞాన భారతి హైస్కూల్ రూపొందించిన 2025 నూతన సంవత్సర కేలండర్‌ను మంగళవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఛైర్మన్ పి. బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీసాయి కృష్ణ ఎంక్లేవ్ వెల్ఫేర్ అసోసియేషన్..


కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్ శ్రీసాయి కృష్ణ ఎంక్లేవ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రచురించిన 2025 నూతన సంవత్సర కేలండర్‌ను సీసీఎస్ ప్రతినిధులతో కలిసి మంగళవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీసీఎస్ అధ్యక్షుడు ఎంపల్లి పద్మారెడ్డి, సప్పిడి శ్రీనివాస్‌రెడ్డి, నేమూరి మహేష్‌గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, సాయికృష్ణ ఎంక్లేవ్ అధ్యక్షుడు రావుల రామచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి సిహెచ్ తిరుమల్‌రెడ్డి, డాక్టర్ కుమారస్వామి, రమణారావు, లక్ష్మీనారాయణ, నరసింహులుగౌడ్, సురేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


ఏఎస్‌రావునగర్ డివిజన్ కాంగ్రెస్ కమిటీ..

కాప్రా: ఏఎస్‌రావునగర్ డివిజన్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నూతన సంవత్సర కేలండర్‌ను ఉప్పల్ కాంగ్రెస్ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు కేశెట్టి ప్రసాద్, అజీజ్, లింగం, సుంకు శ్రీనివాస్ పాల్గొన్నారు.

శానిటేషన్‌పై స్పెషల్ డ్రైవ్

అల్వాల్: జీహెచ్ఎంసీ అల్వాల్ సర్కిల్ పరిధిలో చెత్త సమస్యకు చెక్ పెట్టేందుకు ప్రతి షాపు ముందు డస్ట్‌బిన్ ఏర్పాటు చేసుకోవాలని సర్కిల్ డీసీ, ఏఎంవోహెచ్ రజిని, ఎస్ఎస్. ప్రభాకర్ ఆదేశాల మేరకు అల్వాల్‌లోని కమర్షియల్ ఏరియా, ప్రధాన రహదారిలో ప్రతిషాప్ ఎదుట చెత్త డబ్బాలను ఏర్పాటు చేయాలని సూచనలు చేస్తూ.. స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. జవాన్ చిత్తారి, ఎస్ఎఫ్ఏ వెంకటేష్, వెంకటరామిరెడ్డి, విష్ణు, భాస్కర్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

సత్కారం



రామంతాపూర్ : కురుమ సంఘం బీరప్ప దేవాలయ కమిటీ, ఎల్లమ్మ ఆలయ కమిటీ, యూత్ కమిటీకి ఇటీవల ఎన్నికైన కార్యవర్గ సభ్యులు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయ కమిటీలకు కార్యవర్గసభ్యులుగా ఎన్నికైన వారు ఆలయాలకు వచ్చే భక్తుల మనస్సుకు ప్రశాంతత కలిగే విధంగా ఆధ్యాత్మిక భావనలతో కూడిన వాతావరణాన్ని కలిగించాలన్నారు. కమిటీ సభ్యులు రావుల జంగయ్య, బీరప్ప, శ్రీధర్, కృష్ణయ్య, అంజయ్య, శ్రీనివాస్, శ్రీశైలం, బిక్షపతి, పరందాం, వెంకటేష్ పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

హబ్సిగూడ: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం రామంతపూర్ వీఐ స్ఫూర్తి ఉమెన్స్ డిగ్రీ కాలేజీలో జరిగిన గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు సమాజంపై అవగాహన పెంచుకోవాలన్నారు. కష్టపడి చదివి ఉద్యోగం సాధించడంతో పాటు అనుకున్న లక్ష్యాలను చేరుకుని తల్లిదండ్రులకు, కాలేజీకి మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం ఉత్తీర్ణులైన విద్యార్థినులకు డిగ్రీ పట్టాలను అందజేశారు. కార్యక్రమంలో కాలేజీ చైర్మన్ సురేష్, బీఆర్ఎస్ నేత ప్రభాకర్ రెడ్డి, బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, సాయిజెన్ శేఖర్, ప్రశాంత్‌గౌడ్, పవన్, సురం శంకర్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.


డిగ్రీ పట్టాలను అందజేస్తున్న ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి

సేవతోనే సంతృప్తి

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ మిర్జాలగూడకు చెందిన మాజీ సైనికుడు సత్యనారాయణ సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక మహిళలకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. సేవతోనే సంతృప్తి ఉందని ఆయన పేర్కొన్నారు. స్థానిక మహిళలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.